

# జిజ్ఞాస

శివ్రాజు

ధడేల్‌మంటూ కుప్ప కూలిపోయింది సూర్యం గారి ముందర గది కప్పు.

ఇల్లు కూలుతుండగా కరెంటు పోయిందో కరెంటు పోతుండగా యిల్లు కూలిపోయిందో — తెలియదుకాని పేట పేటంతా చిమ్మచీకటి అయిపోయింది. వచ్చిన పని పూర్తిచేసిన కిరాయి గూండాలాగ వర్షం తగ్గుముఖం పట్టింది.

ఒకటి...రెండు ..మూడు...నాలుగు...అయిదు!

అయిదు నిమిషాలసేపు జనానికి ఏఁవిటయ్యిందో అర్థంకాలేదు. కరెంటు వచ్చింది. ఇరుగు పొరుగు వారు, పక్క సందుల్లోని వారు గుమ్మాల్లోకి వచ్చి బయటకు చూసారు.

ఏఁవుంది? సూర్యం... కుటుంబం నడి రోడ్డుమీద వున్నారు.

సూర్యం వాటాకి వచ్చింది గది–వంటిల్లు వాటా. మిగిలిన వాటాలన్నీ డబ్బు కుదిరినప్పుడు బాగు చెయ్యబడ్డాయి. సూర్యం వాటాకి మాత్రం డబ్బు సర్దుబాటుకాలేదు. వీధివైపు వాటా అది. గది కూలిపోగా... వంటిల్లు కూడా కూలుతుందేమో నన్న భయంతో, అన్నాలకి కూర్చున్న భార్యా పిల్లల్ని కంచాల దగ్గర నుంచి రెక్కపట్టుకుని లేపి పెరటితో వంట బయటపడ్డాడు సూర్యం.

ఒకరు... యిద్దరూ.. ముగ్గురు...నలుగురు...

పిలవని పేరంటంలాగ, వాన తుంపర్లలాగ జనం పోగవసాగారు.

"ఏఁవిటయ్యిందండీ?"

"ఆఁ..ఏముందీ? ఆ మున్సిపాలిటీవాళ్ళు యిహ మనని వుద్దరిస్తారన్నమాట! డ్రైనేజి కోసం రోడ్డు తవ్వెపొస్తూ వీళ్ల గోడ దగ్గర పునాదులలోంచి తవ్వేశారు. ఏఁవుంది? కొంప కూలిపోయింది..."

"అయినా ఆ యింటిగలవాళ్ళు ముందరే చూసుకోవద్దటండీ.? యిల్లు చూస్తే పాత దాయే! రోజులు చూస్తే వానా కాలమాయె!కాస్త పూటీలు గట్రా పెట్టించు కుని ముందు జాగ్రత్త పడొద్దు టండీ?"

"ఆ రోజుల్లో కట్టిన కొంపలే యిలా వుంటే.... ఇక ఈ రోజుల్లో . సిమెంటు బ్లాకులో అమ్మేసి, కంట్రాక్టర్లు యిసకతో కట్టిస్తున్నారు యిళ్ళు!అవెందరి ప్రాణాలు తీస్తాయో!

"చాలా అదృష్టవంతులు... మనుషులు ప్రాణాలతో బయటపడ్డట్టు వున్నారు. ఇల్లు పోతే కట్టించుకోగలం కాని ప్రాణం పోతే తేగలమా?"

రకరకాల వ్యాఖ్యానాలు... సానుభూతులు... నిట్టూర్పులు... ఆశ్చర్యాలు!...."

చూడవచ్చే జనం ఎక్కువవుతున్నారు. ప్రతివారూ అక్కడ అప్పటికే చేరినవారిని వివరాలు అడుగుతున్నారు. వివరాలు విన్న తర్వాత తృప్తి కలగక మరొకసారి సూర్యాన్ని అడిగిన ప్రశ్నలే అడిగి తెలిసిన విషయాలే మరొకసారి అడిగి తెలుసుకుంటున్నారు.

సూర్యానికి ఏం చెయ్యాలో బోధపడటంలేదు. **ఎవరికి రిపోర్టు చెయ్యాలి? ఎలా చెయ్యాలి? ఏమని**

చెయ్యాలి? దీని మరామ్మత్తుకి ఎంతవుతుంది? ఎక్కడనుంచి తేవాలి? ఏ పని ముందు ? ఏ పని వెనక?

అన్నీ ప్రశ్నలే! అన్నీ సమస్యలే!అంతా అయోమయమే!

మున్సిపాలిటీ మీద దావా వెయ్యమని కొందరు సలహాలిస్తున్నారు.

కోర్టు కెక్కినవాడు....గాడిద ఎక్కినవాడు ఒకటే అంటూ...దాని వలన ప్రయోజనం లేదంటున్నారు మరికొందరు.

చక్కగా... ఆ మిగిలిన వంటిల్లు కూడా కొట్టించేసి...జాగాని అయినకాడికి ఏదో రేటుకి అమ్మెయ్యమంటున్నారు యింకొందరు.

# జిజ్ఞాస

ఎలాగూ పడిపోయింది కాబట్టి రీమోడల్ చేయించి కొట్లుగా కట్టేసి షాపుల వాళ్ళకి అద్దెకి యిచ్చెయ్యమన్నారు కొందరు.

అనేక వాదోప వాదాలలో సలహ సంప్రదింపుల మధ్య తలమునకలవుతున్న ఆ ప్రేక్షక సమూహంలో ఒక తండ్రి చెయ్యి పట్టుకొని గుంజాళించింది ఒక చిన్నారి పాప!

ఆ పాప చాలా సేపటి నుంచీ ఈ వాదోపవాదాలు వింటోంది. ఇంత జరిగాకా...యింతసేపు అయ్యాకా...యిదంతా గమనించాకా...ఆ పాపకి తీరని సందేహం ఒకటి వుండిపోయింది.

"ఏంటే?" చికాకుగా కూతురి వంక చూసాడు ఆ తండ్రి.

కుడిచేత్తో తండ్రి చెయ్యి గుంజుతూ... ఎడం చేత్తో లాగు మీదికి లాక్కొంటోంది పాప. అసలే... రావద్దు అంటూ వుంటే వెంటపడింది. మధ్యలో ఈ డిస్ట్రబెన్సు ఒకటి...వెధవ గోల!

"ఏం కావాలే? అల్లరి చెయ్యకు! యిల్లు పడిపోయింది!!" కూతురికి భయం చెప్పి అర్జెంటుగా. సూర్యం తీసుకోవలసిన ఫర్దర్ ఏక్షన్ గురించి చర్చలో పడబోయాడు తండ్రి.

తండ్రి ఆతృత గ్రహించలేదు పాప. మరొకసారి చెయ్యి గుంజి తండ్రి దృష్టి తన వైపు మళ్ళించుకొంది.

చికాకుగా చూసిన తండ్రిని "నాన్నా! మరేమొచ్చి... ఈ రాత్రి వాళ్ళు భోం చెయ్యరా? ఇవాళ వాళ్ళెక్కడ పడుకొంటారు పాపం??" ఆతృతగా అడిగింది పాప!

"చెప నోర్మయ్! పిచ్చి అనుమానాలూ నువ్వూను! అందుకే నాతో రావద్దన్నాను. "జిజ్ఞాసతో పలికే గొంతును నొక్కేసే జన్మహక్కుతో ఒక్క కసురు కసిరాడు తండ్రి.

సానుభూతులు... విమర్శలు... చర్చలు... కొన సాగుతూనే వున్నాయి.

పాపకి సందేహం తీరలేదు.

జిజ్ఞాస చావలేదు. □


## కలువబాల

| | | ఏజంటు ద్వారా | | పోస్టు ద్వారా |
|---|---|---|---|---|
| 3 నెలలకు | —— | రు. 9-00 | —— | రు. 9-90 |
| 6 నెలలకు | —— | రు. 18-00 | —— | రు. 19-80 |
| సంవత్సరమునకు | —— | రు. 36-00 | —— | రు. 36-60 |

## బాలరంజని

| | | ఏజంటు ద్వారా | | పోస్టు ద్వారా |
|---|---|---|---|---|
| 6 నెలలకు | —— | రు. 9-00 | —— | రు. 9-90 |
| సంవత్సరమునకు | —— | రు. 18-00 | —— | రు. 19-80 |

చందా పైకము పంపునప్పుడు కలువబాల/బాలరంజని అని వివరము రాయగలరు.




